# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో శ్రీ నందిని నృత్యాలయం చిన్నారులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 27న రాత్రి దేశంలో ని వివిధ రాష్ట్రాలకు చెందిన ఒకేసారి 5700 మంది కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కూచిపూడి కళా వైభవం2 పేరుతో నిర్వహించిన ఈ ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు దక్కించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ భాగవతుల సేతురాం ఏం.ఏ, పీ.ఎచ్.డి కూచిపూడి, హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ ప్రదర్శనలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ నందిని నృత్యాలయం గురువు, అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డ్ గ్రహీత, అన్నం కల్పన శిష్య బృందం 30 మంది విద్యార్థులతో పాల్గొని నృత్యంలో ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించారు. వారి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం రాష్ట్ర గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి స్వప్నిల్ మరియు రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ ను అందుకున్నారు. శ్రీ నందిని నృత్యాలయం నర్తకినులు గిన్నిస్ రికార్డులో చోటు సంపాధించుకోవడంపై మంచిర్యాల జిల్లా వాసులు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివ సేనారెడ్డి. ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కాల్వ సుజాత, భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు లలిత నృత్య కళాకారులు పాల్గొన్నారు



# ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన దండ నాయకుల విజయలక్ష్మి తన భర్త మృతి చెందినట్లు పేర్కొంటూ మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన భోగే రాజేశ్వరి కుటుంబ సభ్యుల ధ్రువపత్రాల కోసం అర్జీ సమర్పించారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంధ్యవేణి నడిపి రాజం తాను కొనుగోలు చేసిన భూమి నిషేధిత జాబితాలో ఉండటాన్ని తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పోచంపాడు గ్రామస్తులు గ్రామ శివారులోని హద్దుల సమస్యలను విచారణ చేసి పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. నస్పూర్ మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మంద ఇసయ్య తనను, తన భార్యను ఇంటి నుంచి వెళ్లగొట్టిన చిన్న కుమారుడు, కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం దొరగారిపల్లె ప్రాంతానికి చెందిన కొడిపె పోశవ్వ ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన ఆడెపు రాయమల్లు తన పోషణను పట్టించుకోవడం లేదని న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. ప్రతి అర్జీపై క్షుణ్ణంగా విచారణ చేసి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ




**శెనార్తి మీడియా, బోథ్:**

తల్లి జ్ఞాపకార్థంగా మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ, ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్, సర్పంచ్ అన్నపూర్ణ మాట్లాడారు. చిన్న వయసులోనే తల్లి పేరుతో ఇంత విస్తృతంగా సేవలు చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన తొలి కార్యక్రమం ఇదేనని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుండ్రు విజయలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్, వార్డు సభ్యులు మేడిచెల్మ రూప ప్రవీణ్, కరిపే శ్రీనివాస్, బిట్లింగ్ గిరీష్, కుట్టు మిషన్ నిర్వాహకురాలు శ్రీజ, సన్నీ రెడ్డి, గ్రామపంచాయితీ సిబ్బంది, కుట్టు మిషన్ శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.




# రాష్ట్రంలో యూరియా కొరత లేదు: మంత్రి తుమ్మల

**శెనార్తి మీడియా, హైదరాబాద్/మంచిర్యాల:**

రాష్ట్రంలో వ్యవసాయానికి అవసరమైన యూరియా సమృద్ధిగా ఉందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సభ్యసాచి గోష్, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూరియా సరఫరా పుష్కలంగా ఉందని, కార్యచరణ ప్రణాళిక ప్రకారం రైతులకు పంపిణీ చేయాలని మంత్రి సూచించారు. యూరియా యాప్‌ను పైలట్‌గా పెద్దపల్లి, నల్గొండ, జనగామ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, అవకతవకలు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో 1800 599 5770 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సభ్యసాచి గోష్ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని చెప్పారు. యాప్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో పంపిణీ చేపడతామని, ప్రతి కేంద్రంలో కనీసం మూడు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి 362 దుకాణాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతోందని తెలిపారు. మొత్తం 3,534 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, సొసైటీల వద్ద 404, ప్రైవేట్ డీలర్ల వద్ద 763, మార్క్‌ఫెడ్ బఫర్‌గా 1,832 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్‌ల మరమ్మతులు చేయాలని కమిషనర్కి వినతి



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను వెంటనే మరమ్మతులు చేయాలని కాంగ్రెస్ నాయకుడు అనంతుల రమేష్ ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంతుల రమేష్ మాట్లాడుతూ... నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే వాటి నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దా లేక నగరపాలక సంస్థదా స్పష్టత లేదని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 3.60 కోట్ల రూపాయల వ్యయంతో నగరంలోని పలు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 30 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఒక్కో ఓపెన్ జిమ్‌కు సుమారు 12 లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రస్తుతం చలికాలం కావడంతో నగరవ్యాప్తంగా ఓపెన్ జిమ్‌లు కిటకిటలాడుతున్నాయని, వ్యాయామం చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. అయితే చాలా చోట్ల పరికరాలు చెడిపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ఓపెన్ జిమ్‌లు ఈ విధంగా నిరుపయోగంగా మారుతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. గత పాలకవర్గం నగర ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిందా, లేక కమిషన్ల కోసమా అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఓపెన్ జిమ్‌లను వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

# బీసీల డిమాండ్లపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

బీసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం సమీపంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ ఫెడరేషన్లకు పాలకమండలులు ఏర్పాటు చేసి తగిన నిధులు విడుదల చేయాలని తెలిపారు. నామినేటెడ్ పదవులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం, జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. సంచారక కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కొత్తగా ఏర్పాటైన ప్రతి కార్పొరేషన్‌కు రెండువేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని తెలిపారు. ప్రభుత్వ టెండర్లు, పారిశ్రామిక రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అత్యాచార నిరోధక చట్టాన్ని బీసీలకు కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీల డిమాండ్లపై చర్చించి పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జల వెంకటయ్య, శాఖపూరి భీమ్సేన్, ధర్మాజీ మల్లేష్, ఆరెందుల రాజేశం, కీర్తి బిక్షపతి, అంకం సతీష్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మంచర్ల సదానందం, కొట్టి నటేశ్వర్, రామగిరి రాజన్న చారి తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకతకే సామాజిక తనిఖీ

- **సర్పంచ్ శ్రీమతి బైర మానసరాజేందర్**

**(శెనార్తి మీడియా బెజ్జంకి)**

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం అమలు చేయటానికి సామాజిక తనిఖీ ఉపయోగపడుతుందని దాచారం గ్రామ సర్పంచ్ శ్రీమతి బైర మానస రాజేందర్ తెలిపారు.దాచారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ 2024,2025 14వ విడత సామాజిక తనిఖీ లో భాగంగా గత నాలుగు రోజుల నుండి దాచారం గ్రామంలో డిఆర్పి సంధ్య ఉపాధి హామీ, ఎన్నార్జీయస్ నిధులు ఆడిటింగ్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఈ సమావేశంలో డీఆర్పీ సంధ్య మాట్లాడుతూ నిధుల ఖర్చు వివరాలు తెలిపారు.అదే విదంగా ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డ్ లేని వాళ్లకు నూతన జాబ్ కార్డ్ వచ్చేందుకు,జాబ్ కార్డ్ ఉన్న ప్రజలు ఉపాధి హామీ పనిని వినియోగించుకోవాలి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్,ఉపసర్పంచ్ దీటి బాలనర్స్ ,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆశ్రమాల్లో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులను వెంటనే నియమించాలని యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి తిరుపతి కోరారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ యువరాజ్ మర్మట్‌కు గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వెంటనే రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని, ఇన్‌చార్జ్ విధానాన్ని రద్దు చేసి పూర్తిస్థాయి ప్రధానోపాధ్యాయులను నియమించాలని తెలిపారు. విద్యార్థుల భద్రత కోసం 24 గంటల పర్యవేక్షణ వ్యవస్థ అమలు చేయాలని, భోజన నాణ్యతను మెరుగుపరచి మెనూను కఠినంగా అమలు చేయాలని చెప్పారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో శాశ్వత వైద్య సదుపాయాలు, ప్రాథమిక చికిత్స, ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు వంటి మౌలిక సదుపాయాలను తక్షణమే మెరుగుపరచాలని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది నియామకాలు చేయాలని, సీసీ కెమెరాలు, గేటు భద్రత, రాత్రి వాచ్‌మన్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. గిరిజన విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఇన్‌చార్జ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి రెగ్యులర్ వార్డెన్లు, రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని యుఎస్ఎఫ్ఐ కోరుతోందని తెలిపారు.

# ఉపసర్పంచ్ ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై చెర్యలు తీసుకోవాలి

- **రజక సంఘం నాయకులు**



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం సివ్వారం గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికైన రాగళ్ల శంకరమ్మ-వెంకటేష్ నివాసంపై దాడి జరిగినట్లు సమాచారం. తిప్పని రాజా గౌడ్ సునీత కుటుంబ సభ్యులు ఈ దాడికి పాల్పడ్డారని బాధిత కుటుంబం ఆరోపించింది. గ్రామ ఉపసర్పంచ్ పదవిలో రజక కులానికి చెందిన శంకరమ్మ ఉండటాన్ని జీర్ణించుకోలేక కులం పేరుతో దూషణలకు దిగారని, రాజకీయాల్లో ఉండే అర్హత లేదని బెదిరింపులు చేశారని పేర్కొన్నారు. మహిళ కావడంతో ఉపసర్పంచ్‌గా ఏమి చేయగలవని అవమానకరంగా మాట్లాడారని తెలిపారు. అనంతరం ఇంటిపై రాళ్లు, చెప్పులతో దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారని వివరించారు. ఈ ఘటనపై రాగళ్ల వెంకటేష్ కుటుంబం స్పందిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సంఘటన విషయం తెలుసుకున్న తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగళ్లపల్లి వెంకటేష్, జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, ముస్కే చందర్, మందమర్రి మండల పైతర ఓదెలు కనకయ్య తదితరులు బాధితులను పరామర్శించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసినట్లు తెలిపారు.

# విద్యాధన్ సంస్థపై విచారణ చేపట్టాలి: సిఐటియు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఐటీడీఏ పరిధిలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యాధన్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ సేవలపై సమగ్ర విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యాధన్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు న్యూట్రి గార్డెన్ పేరుతో కూరగాయల సాగు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం పేరుతో తోటమాలీలు, వాచ్‌మన్‌లు, సూపర్వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారని చెప్పారు. అయితే నెలలు గడిచినా వారికి జీతాలు చెల్లించలేదని ఆరోపించారు. పనిలోకి తీసుకునే సమయంలో కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. నాన్‌ప్రాఫిట్ ఆర్గనైజేషన్ అని చెప్పుకుంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం అన్యాయమని అన్నారు. విద్యాధన్ ఆర్గనైజేషన్‌పై విచారణ జరిపి జీతాలు చెల్లించని అంశంపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

# ఇంటర్ లింకింగ్‌తో నిరంతర విద్యుత్

**మంచిర్యాల**

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ ఆధునిక సాంకేతిక మార్పులు చేపడుతోందని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. రాజన్న తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు ఇంటర్ లింకింగ్ లైన్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా ఏదైనా ఒక సబ్ స్టేషన్ లేదా లైన్‌లో సమస్య ఏర్పడినప్పుడు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ద్వారా ఒక 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి మరో 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు, ఒక 33 కేవీ లైన్ నుంచి మరో 33 కేవీ లైన్‌కు అనుసంధానం చేసి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించవచ్చని తెలిపారు. దీంతో ప్రధాన లైనులో సమస్య వచ్చినా ప్రత్యామ్నాయ లైన్ ద్వారా వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించవచ్చని చెప్పారు. ఇంటర్ లింకింగ్ వ్యవస్థ అమలుతో గతంలో నాలుగు గంటల వరకు కొనసాగిన విద్యుత్ అంతరాయ సమయం ప్రస్తుతం ఒక గంటకు తగ్గిందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, నిర్వహణ పనుల సమయంలో కూడా వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందుతోందని వివరించారు. మంచిర్యాల సర్కిల్ పరిధిలోని 51 33/11 కేవీ సబ్ స్టేషన్లు, 21 33 కేవీ లైన్లలో ఇప్పటికే ఇంటర్ లింకింగ్ వ్యవస్థ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన నాలుగు సబ్ స్టేషన్లు, నాలుగు లైన్లకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణతో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. భవిష్యత్తులో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ కీలకంగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# "నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తప్పవు"

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**శెనార్తి మీడియా, మంచిర్యాల/రామగుండం:**





దర్యాప్తు నాణ్యత పెంచి కేసుల పరిష్కార శాతాన్ని మెరుగుపరచాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నెలవారీ నేరాల సమీక్షలో భాగంగా సోమవారం సాయంత్రం కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీలు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్ వారీగా పెండింగ్ కేసుల వివరాలను సమీక్షించిన కమిషనర్ నేరస్థుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, సాక్ష్యాల సేకరణ, చార్జ్‌షీట్ల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులపై ప్రత్యేకంగా సమీక్ష జరిపారు. గతంలో జరిగిన లోపాలు, భవిష్యత్తులో కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్టేషన్ వారీగా అధికారులతో చర్చించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యూఐ, పీటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్, ఎన్బీడబ్ల్యూ కేసులను వేగంగా, నాణ్యంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, అవసరమైతే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళలపై నేరాలకు సంబంధించి దర్యాప్తు పారదర్శకంగా, వేగంగా నిర్వహించి నిందితులకు శిక్షలు పడేలా బలమైన సాక్ష్యాలు కోర్టుకు సమర్పించాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో బాధితులకు పరిహారం త్వరగా అందేలా చూడాలని తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా స్పందించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో రోడ్డు సేఫ్టీ విభాగంతో కలిసి ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి కారణాలపై విశ్లేషణ చేసి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి వాలంటీర్లను సిద్ధం చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, బాధితులకు సకాలంలో సహాయం అందేలా చూడాలని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించి, ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సీసీ పీఎస్ ఏసీపీ, ఏఓ శ్రీనివాస్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని ఇన్స్పెక్టర్లు, సీఐలు, ఎస్ఐలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# అనారోగ్యాన్ని లెక్కచేయని పీఎస్సార్..

- మంచిర్యాలలో పర్యటన
- అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నిర్మాణంలో ఉన్న మాత శిశు సంరక్షణ కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించిన ఆయన నాణ్యతకు లోటు లేకుండా గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం కార్పొరేషన్ పరిధిలోని కాలేజ్ రోడ్, గోదావరి రోడ్డులో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మహాప్రస్థానాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన శవ విగ్రహాన్ని పరిశీలించి, నిర్మాణం పూర్తైన ఉద్యానవనం, పూల మొక్కల ఏర్పాట్లను గమనించారు. అవసరమైన చోట్ల మరింత మెరుగుదల చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులడిగితే అరెస్టులా?

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**




తమకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రశ్నించినందుకే మాజీ సర్పంచులను అరెస్టు చేయడం సరికాదని బెజ్జంకి మండల సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చింతలపల్లి సంజీవరెడ్డి తీవ్రంగా ఖండించారు. గత రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మాజీ సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజల అవసరాల కోసం చేపట్టిన పనులకు ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయాలనుకుంటే, అసెంబ్లీ ముట్టడి చేస్తారనే అనుమానంతో ముందస్తుగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా సంజీవరెడ్డి అభివర్ణించారు. మాజీ ప్రజాప్రతినిధుల గొంతు నొక్కే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మాజీ సర్పంచులకు రావాల్సిన బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు.

# క్రీడల వైపు యువత అడుగులు వేయాలి

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



ప్రస్తుత పరిస్థితుల్లో యువత మానసిక ఒత్తిడితో చెడు వ్యసనాల బాట పట్టే ప్రమాదం ఉందని, అలాంటి పరిస్థితుల నుంచి బయటపడేందుకు క్రీడలే ఉత్తమ మార్గమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. కేశవపట్నం పోలీసుల ఆధ్వర్యంలో "Say No to Drugs – Say Yes to Sports" నినాదంతో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌కు సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగింది. మొత్తం 20 జట్లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా గౌస్ ఆలం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందించడమే కాక క్రమశిక్షణను అలవర్చుతాయని చెప్పారు. ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు కీలకంగా దోహదపడతాయని పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి క్రీడారంగంలో రాణిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పోటాపోటీగా సాగిన ఫైనల్‌లో కేశవపట్నం జట్టు విజేతగా నిలవగా, మొలంగూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, హుజురాబాద్ ఏసీపీ వి. మాధవి, హుజురాబాద్ రూరల్ సీఐ పీ వెంకటి, కేశవపట్నం ఎస్సై కె. శేఖర్, ఇతర పోలీస్ సిబ్బంది, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూపాయికే నల్లా కనెక్షన్



- ఆడపిల్ల పుడితే రూ. 2016 డిపాజిట్

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

గంగాధర మండలం కురిక్యాల జీపీ పాలకవర్గం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కడారి రేణుక అధ్యక్షతన సోమవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. గ్రామంలో కొత్తగా నల్లా కనెక్షన్ తీసుకునేవారు కేవలం ఒక్క రూపాయి చెల్లిస్తే కనెక్షన్ ఇస్తామని, గ్రామంలో ఆడపిల్ల పుడితే రూ. 2016 ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తామని తీర్మానం చేసింది. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జీపీ పాలకవర్గాన్ని గ్రామస్తులు అభినందించారు.



## జిల్లాలో యూరియా కొరత లేదు

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- కలెక్టర్ పమేలా సత్పతి

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వల్లో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు లోనవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 4,246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాకు 22,368 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద షామియానా, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు మొక్కజొన్న సాగుకు పూర్తిగా సరిపోతాయని తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని రైతులకు భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. యూరియాను కృత్రిమంగా కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యూరియా సరఫరాలో సమస్యలు ఎదురైతే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని కలెక్టర్ కోరారు

## బాస్కెట్ బాల్‌లో జాతీయ స్థాయిలో దూసుకెళ్తున్న సహస్ర

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం లో బాస్కెట్‌బాల్ శిక్షణ పొందు తున్న సహస్ర, హైదరాబాద్‌లో నవంబర్ 28 నుంచి 30 వరకు జరిగిన 69వ ఎస్జీఎఫ్ అండర్–14 బాలికల విభాగ పోటీల్లో కరీంనగర్ నుంచి ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది.ఈ ప్రదర్శనతో భోపాల్‌లో డిసెంబర్ 19 నుంచి 23 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీ ల్లో పాల్గొనే అవకాశం సహస్రకు లభించింది. క్రీడలో చూపుతున్న పట్టుదల, నిరంతర కృషి వల్ల సహస్ర భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని కోచ్ పర్మిత కౌర్, అరుణ్ తేజ్ హర్షం వ్యక్తం చేశారు.తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల మార్గనిర్దేశం సహస్ర ఎదుగుదలకు బలంగా నిలుస్తున్నాయని వారు తెలిపారు.

## సర్పంచ్‌కు తహసీల్దార్ సన్మానం

**శెనార్తి మీడియా, పెద్దపల్లి:** పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన మ్యాడగోని శ్రీనివాస్ గౌడ్‌ను, ఉప సర్పంచ్ మేకల కుమార్ యాదవ్‌ను సోమవారం తహసీల్దార్ రాజయ్య శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలన సాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం వహించవద్దు

- రికార్డులు పారదర్శకంగా నిర్వహించాలి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం
- కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఆకస్మిక తనిఖీలు

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



ప్రతి విభాగంలో విధులు బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, రికార్డులు సక్రమంగా, పారదర్శకంగా ఉంచాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను జాగ్రత్తగా కాపాడుకోవాలని, సేవల్లో వేగం పెంచాలని సూచించారు. సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పలు కీలక కార్యాలయాలు, విభాగాలను ఆయన తనిఖీ చేశారు. కార్యాలయాల నిర్వహణ, రికార్డుల నమోదు, భద్రతా విభాగాల పనితీరును స్వయంగా పరిశీలించారు. కమిషనర్ కార్యాలయం, ఆర్ఐ అడ్మిన్ కార్యాలయంలో ఫైళ్ల నిర్వహణ, సిబ్బంది హాజరు, సర్వీస్ రికార్డులను తనిఖీ చేశారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పోలీస్ వాహనాల స్థితిగతులు, లాగ్‌బుక్స్, వాహనాల నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెల్ ఆఫ్ ఆర్మ్స్ విభాగంలో ఆయుధాల నిల్వ, భద్రతా ఏర్పాట్లు, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. హోం గార్డ్స్ విభాగంలో సిబ్బంది కేటాయింపులు, విధులకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. స్పెషల్ యాక్షన్ టీమ్, డాగ్ స్క్వాడ్ విభాగాల్లో ప్రత్యేక దళాల సంసిద్ధత, శిక్షణ, నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. బాంబ్ డిస్పోజల్ టీమ్‌లో అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే పరికరాల పనితీరు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, కమిషనరేట్ ఏవో మునిరామయ్య, ఆర్ఐలు రజినీకాంత్, కిరణ్ కుమార్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణాపాయ స్థితి నుంచి మహిళకు పునర్జన్మ

- ఎక్టోపిక్ గర్భధారణ శస్త్రచికిత్స విజయవంతం

**శెనార్తి మీడియా, పెద్దపల్లి:**

అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న మహిళను ప్రాణాపాయం నుంచి కాపాడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ ప్రతిభను నిరూపించారు. గర్భసంచి వెలుపల గర్భధారణ కారణంగా తీవ్ర అంతర్గత రక్తస్రావంతో ఆసుపత్రికి చేరిన మహిళకు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు నిలబెట్టారు. పెద్దపల్లి జిల్లా రంగంపల్లి గ్రామానికి చెందిన 35 ఏళ్ల మహిళ తీవ్ర కడుపునొప్పితో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరింది. ఆమెను పరీక్షించిన గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీనయన వెంటనే స్కానింగ్ చేయించారు. స్కానింగ్ లో గర్భసంచి పక్కన ఉన్న ట్యూబ్‌లో గర్భధారణ జరిగి, అది పగిలిపోవడంతో కడుపులో తీవ్రమైన రక్తస్రావం జరుగుతున్నట్లు గుర్తించారు. రోగి పరిస్థితి విషమంగా ఉండటంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్ శ్రీనయన ఆధ్వర్యంలో వైద్య బృందం అత్యవసర శస్త్రచికిత్స చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ రామం, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి సర్జరీని విజయవంతం చేశారు. సకాలంలో చికిత్స అందడంతో మహిళ ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ శ్రీనయన, డాక్టర్ రామం, సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ అభినందించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, క్లిష్ట శస్త్రచికిత్సలు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

